# మగబుద్ధి

సిటీబస్‌కోసం బస్‌స్టాపులో నిలబడ్డ సీతారామయ్యకి సీమటపాకాయలాంటి ఆ అమ్మాయిని చూసేసరికి ఉత్సాహం ఉరకలు వేసి, మనస్సు వశంతప్పి నెమలిలా నాట్యం చేయసాగింది. ఇరవైయేళ్ళ పరువాల యౌవనాన్ని గులాబీరంగు టెర్రీకాట్ చీర వంపులూ వయ్యారాలూ కనిపించేలా భద్రంగా పదిలంచేసి, మెరిసిపోతున్న చేతికి అంతకంటే మెరిసిపోతూన్న వాచీపెట్టుకుని; ఓచేత్తో చిన్న బ్రీఫ్‌కేసూ మరోచేత్తో మడిచిన మేగ్‌జైనూ పట్టుకుని, అందాలన్నీ కుప్పపోసినట్లు విలాసంగా నుంచున్న ఆ అప్సరసమీంచి, కళ్ళు తిప్పుకోలేకపోతున్నాడు సీతారామయ్య.

ఆ అప్సరస అప్పుడే రైలుదిగో, లేక ఏదూర ప్రయాణం చేసో వచ్చినట్లుంది. చీర నలిగి, జుట్టురేగి, శరీరం వడిలి కొద్దిగా బడలికగా కనిపిస్తోంది. బయలు దేరినపుడు తాజా గులాబీలాగే ఉండిఉంటుంది. ఇప్పుడుమాత్రం, రోజంతా ఫ్లవర్ వాజ్‌లోంచి పరిమళాలు వెదజల్లి వాడిపోయిన పువ్వులగుత్తిలా ఉంది. ఆమె ముక్కు సంపెంగ రంగులో ఉంది. సంపెంగా, మొగలీ కాస్త వాడితేనే బాగుంటాయి. ఈ సంపెంగ పువ్వుకూడా అలాగే ఉంది.

అసలీ అమ్మాయిని అప్సరస అని పిలుద్దామా, సంపెంగ అని పిలుద్దామా? ఏపేరు ఈమెకి సరిగ్గా సరిపోతుంది? ఇలా సీతారామయ్య సతమత మవుతూ ఉండగా బస్సువచ్చింది. సంపెంగలాంటి ఆ అప్సరస, జాకెట్‌లోంచి ఓ చిన్నపర్సు తీసి, ఆ పర్సులోంచి ఓ కాగితం తీసి, కాగితంలో ఉన్న నెంబరూ బస్సుమీద ఉన్న నెంబరూ సరిపోయాయా లేదా అని సరిజూసుకుంటోంది. సీతారామయ్యకూడా ఆమెని కళ్ళకి నిండుగా చూసుకుంటున్నాడు.

కండక్టరు బస్ కొట్టి రైట్ రైట్ అన్నాడు.

అప్పటికి అప్సరసకి అంకెలు సరిచూసుకోవడం పూర్తిఅయింది. సీతారామయ్యకూడా ఆమె అందాన్ని కళ్ళతో త్రాగడం పూర్తిఅయింది. ఇద్దరికీ సంబంధించిన మొత్తం నాలుగుకళ్ళూ, కదులుతూన్న బస్‌ని చూశాయి కంగారుగా-

అయ్యో ..... అయ్యో ... అదేబస్ ... వెళ్ళిపోతోంది - అండి, తొట్రుపడుతూ అప్సరస.

చచ్చాం .... ఈ అమ్మాయి అందాలు బేరీజు వెయ్యడంలో బస్ కాస్తా మిస్సే అయ్యాం - నిట్టూర్చాడు సీతారామయ్య.

ఇంతవరకూ సందడిగా ఉన్న బస్‌స్టాప్ స్తబ్దంగా మారింది. అంతా వెళ్ళిపోయి ఆ అమ్మాయీ సీతారామయ్య ఇద్దరే మిగిలారు. అనుకోకుండా ఒకళ్ళకేసి ఒకళ్ళు చూసుకున్నారు.

మీరుకూడా ఇరవయ్యోనంబరు బస్సే ఎక్కాలా? అని అడగాలనుకున్నాడు. కాని గొంతుదాటిశబ్దం బయటికి రాలేదని సీతారామయ్యకి తెలియదు.

"ఏవండీ! ఇరవయ్యోనెంబరు బస్సు మళ్ళీ ఎంతసేపటికి వస్తుందండీ?"

రామచిలుకో రాయంచో మనుష్యభాషలో మాట్లాడినట్లయి ఆశ్చర్యంగా చూస్తూఉండిపోయాడు సీతారామయ్య.

"మిమ్మల్నే".

ఉలిక్కిపడి సీతారామయ్య ఉబ్బి తబ్బిబ్బయి, వణుకూతున్న గొంతుకని స్వాధీనంలోకి తెచ్చుకోవడానికి నానా అవస్థపడ్డాడు. ఆ తర్వాత మరో బస్సు ఎక్కి బస్‌లో ఆమె కూర్చున్న సీటు దగ్గర్లోనే బెల్ట్ పట్టుకుని నుంచున్న సీతారామయ్య ఇంకోమాటు ఉలిక్కిపడ్డాడు. కద్రవంతెన స్టాపుట-అదివచ్చినప్పుడు కాస్తచెప్తారా అని అప్సరస అనబడే ఆ సంపెంగ పువ్వు తనని అడిగినపుడు.

"కద్రవంతెనాండీ-నేనూ ఆ స్టాప్ దగ్గరే దిగేది" అన్నాడు అతికష్టంమీద, దడదడ కొట్టుకొంటూన్న గుండెల్ని చేత్తో రాసుకుంటూ.

కద్రవంతెన దగ్గర తనతోబాటూ బస్సుదిగి, ఆ మసక వెల్తురులో తన పక్కపక్కనే నడుస్తూన్న అజ్ఞాత సుందరిని "మీరు ఎక్కడికి వెళ్ళాలి?" అని అడిగాడు సీతారామయ్య.

"కాళేశ్వరరావు రోడ్డులోకి వెళ్ళాలి. అక్కడ రెండు పొగడచెట్లు ఉంటాయిట. సుబ్బరామయ్యగారి యింటికి" అంది.

"అరే! సుబ్బారామయ్యగారు మా నాన్నగారే! మీరు వస్తున్నది మా యింటికే!" సంతోషసముద్రంలో మునిగిపోతూ, ఒక్క అరుపు అరిచాడు సీతారామయ్య.

* * *

రాత్రి అంతా ఎలాగో కష్టపడి, ఉగ్గబట్టుకొని, తెల్లారుతుండగా ఇంక ఉండబట్టలేక తల్లిని అడిగేశాడు సీతారామయ్య "నిన్న మనింటికి వచ్చిన అమ్మాయి ఎవరూ అవటా" అని.

ఆమె చిత్రంగా కళ్ళు తిప్పి చూపుడువేలు బుగ్గని చేర్చి "ఇదేం చోద్యంరా! ఎవరో తెలియకుండానే తీసుకు వచ్చావా బస్‌స్టాప్‌నుంచి ఇంటికి?" అంది చిన్నగా నవ్వుతూ. సీతారామయ్యకి అర్థంకాలేదు.

"అదేమిటిరా! క్రిందటి దసరాలకి మా అన్నయ్య గారింటి కెళితే పక్కవీధిలోనే ఉన్న వాడి తోడల్లుడుగారు రావడం, మా అమ్మాయిని మీకోడల్ని చేసుకోమని నన్నూ మీ నాన్నగారినీ బ్రతిమలాడటం జ్ఞాపకం లేదూ. పిల్లని చూసి వద్దాంఅంటే నువ్వు తాడి ఎత్తున ఎగిరి ఈపల్లెటూరి పిల్లలూ పల్లెటూరి సంబంధాలు మనకక్కర్లేదని అల్లరి చేస్తే, మర్యాదకోసం మేం వాళ్ళయింటికి వెళ్ళి చూసివచ్చి జాతకాలు కుదరలేదని కబురు చేయ్యలేదూ? ఆపెళ్ళికూతురే ఇది. వెంకాయమ్మ. రేపిక్కడేదో బేంక్‌లో ఇంటర్వ్యూ ఉందిట ....."

తర్వాత ఆమె చెప్పిన మాటలేవీ సీతారామయ్యకి వినిపించలేదు ఇంకా ఆమెకి పెళ్ళికాలేదా? అన్న తన ప్రశ్నకి అమ్మ అర్థవంతంగా నవ్వేసరికి తనకే సిగ్గేసింది .... మీనాన్నగారుకూడా ఇంతేరా ముందు పెళ్ళి చూపుల్లో నన్ను చూసి బాగోలేదనీ, తర్వాత ఎవరిపెళ్ళిలోనో చూసి సరే అని ఒప్పుకున్నారు. అసలు మగ బుద్ధే అంతేనేమో" అంటూ పక పక నవ్వింది.

పెళ్ళి అయ్యాక సుబ్బాయమ్మపేరు సుందరిగా మార్చాడు అనుకోండి కాని సీతారామయ్య అది వేరే విషయం. కాని అదే మగబుద్ధిఅంటే ఇక చేసేదేంలేదు.

(విశ్వరచన, ఆగష్టు 1989)

*